## అదుపు తప్పిన స్కూల్ ఆటో..

### ఇద్దరికి గాయాలు.. తప్పిన ప్రమాదం

శివ్వంపేట, అక్టోబర్ 7: విద్యార్థులను స్కూల్‌కు తీసుకువెళ్లే ఓ ఆటో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన ఘటన శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాదాపు 15 మంది విద్యార్థులు చిన్నగొట్టిముక్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి రోజూ త్రీ వీలర్ ఆటోలో వెళ్తారు. పాఠశాల ముగించుకున్న అనంతరం సాయంత్రం తిమ్మాపూర్‌కు వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో అకస్మాతుగా ఆటో అదుపుతప్పి వరిపొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పూజ, అక్షయలకు గాయాలు కాగా మిగిలిన విద్యార్థులంతా క్షేమంగా బయటపడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులను దవాఖానకు తరలించారు. గ్రామంలో దాదాపు 70మంది విద్యార్థుల ఉన్నత చదువులకు నర్సాపూర్, శివ్వంపేట, చిన్నగొట్టిముక్ల గ్రామాలకు వెళ్తుంటారని, అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మనోహరాబాద్, అక్టోబర్7: మనోహరాబాద్ మండలం పర్కిబండకి చెందిన గోసు మంగకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.43,500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీరామ్ శనివారం లబ్ధిదారురాలికి అందజేశారు.

## సస్యరక్షణ చర్యలు పాటించాలి

మెదక్ రూరల్, అక్టోబర్ 7: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏఈవో శేఖర్ సూచించారు. శనివారం మెదక్ పట్టణ శివారులో సాగు చేస్తున్న వరి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పైరుకు తెగులు సోకితే వ్యవసాయ అధికారులను సంప్రదించి వారు సూచించిన మందులను పిచికారి చేయాలని సూచించారు.

## పశువులకు కృత్రిమ గర్భధారణ

వెల్దుర్తి, అక్టోబర్ 7: వ్యవసాయంతోపాటు పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వెల్దుర్తి పట్టణ సర్పంచ్ భాగ్యమ్మఆంజనేయులు అన్నారు. పంచాయతీ పరిధిలోని శేరీలలో శనివారం పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కృత్రిమ గర్భధారణ శిబిరంతో పాటు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పశువైద్యాధికారి రేఖతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఫజల్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



శేరీలలో కృత్రిమ గర్భధారణ చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యమ్మ



భాగ్యలక్ష్మి కాపర్ పరిశ్రమ ప్రతినిధులను అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# గ్రామానికి మరిన్ని సేవలు అందించాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

శివ్వంపేట, అక్టోబర్ 7: శభాష్‌పల్లి గ్రామానికి 'భాగ్యలక్ష్మి కాపర్ పరిశ్రమ' ప్రతినిధులు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భాగ్యలక్ష్మి కాపర్ పరిశ్రమ ప్రతినిధులు శభాష్‌పల్లి గ్రామంలో ఇప్పటివరకు మూడు తాగునీటి బోర్లు, మూడు మినీట్యాంకులు, ప్రాథమిక పాఠశాల విద్యావలంటరీకి నెలకు రూ.9వేలు, వైకుంఠరథం అందజేయడంతో శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా అభినందించి కంపెనీ ప్రతినిధులు రాకేశ్ అగర్వాల్, వీరభద్రరావులను శాలువాలతో సన్మానించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ పార్వతి, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ రవినాయక్ ఉన్నారు.

# సంసారాలను నాశనం చేసుకోవద్దు

- జూనియర్ సివిల్ జడ్జి అనిత
- జడ్జి సమక్షంలో ఒక్కటైన భార్యాభర్తలు

నర్సాపూర్, అక్టోబర్7: మనస్పర్థలతో దూరంగా ఉన్న భార్యాభర్తలు జడ్జి సమక్షంలో ఒక్కటైన సంఘటన నర్సాపూర్ కోర్టులో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భార్యభర్తలైన షేక్ సైపూర్ రహమత్, షేక్ సంరిన్ కొంత కాలంగా విడిపోయి దూరంగా ఉంటున్నారు. పీఎల్‌సీ కేసులో భాగంగా న్యాయమూర్తి అనిత దంపతులను కోర్టులో కలపడం జరిగింది. దంపతులు కలవడంతో తన భార్యను ఉన్నత చదువులు చదివిస్తానని, సంతోషంగా జీవితాన్ని గడుపుతామని ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేశారు. అనంతరం జడ్జి అనిత మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలతో సంసార జీవితాలను నాశనం చేసుకోవద్దని, బాల్య వివాహాలను నిర్మూలించడం కోసం చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపరాణి, రాజునాయక్, ఆనంద్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్, సీడీపీవో హేమభార్గవి తదితరులు పాల్గొన్నారు.



జడ్జి అనిత సమక్షంలో ఒక్కటైన దంపతులు

# 'బ్రేక్‌ఫాస్ట్'తో విద్యార్థులకు విద్యపై శ్రద్ధ

నర్సాపూర్, అక్టోబర్7: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికను, బోధన తీరును, పలు రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎంబ్రేక్‌ఫాస్ట్ పథకంతో విద్యార్థులకు విద్యపై శ్రద్ధ పెరుగుతుందని తద్వారా హాజరుశాతం పెరిగి డ్రాప్‌ఔట్స్ తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సుదర్శనమూర్తి, ప్రవీణ్, ప్రధానోపధ్యాయుడు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు నర్సింహాచారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్



మాల్కాపూర్ తాండలో స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న సర్పంచ్

## క్రీడాకారులను మరింత ప్రోత్సాహం

మెదక్ రూరల్, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వం యువత కోసం అందిస్తున్న కేసీఆర్ స్పోర్ట్స్ కిట్‌లను, విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని క్రీడా రంగాల్లో రాణించాలని సర్పంచ్ సరోజామోహన్ అన్నారు. శనివారం మెదక్‌మండల పరిధిలోని మాల్కాపూర్‌తాండలో సర్పంచ్ క్రికెట్, వాలీబాల్ కిట్లను యువతకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను మరింత ప్రోత్సహించాడానికి ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించి క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చక్రం, వార్డు సభ్యులు శ్రీను, మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి దిగంబర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

## మరింత చేరువలో వైద్య సేవలు

నర్సాపూర్, అక్టోబర్7: ఆరోగ్య ఉప కేంద్రంతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పెద్దచింతకుంట సర్పంచ్ శివకుమార్ వెల్లడించారు. శనివారం మండల శనివారం మండల పరిధిలోని పెద్దచింతకుంటకి మంజూరైన ఆరోగ్య ఉప కేంద్రానికి సర్పంచ్ శివకుమార్, వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యులు ప్రసాద్, గ్రామపెద్దలు కుమ్మరి అంజయ్య, మొగులయ్య, చంద్రమౌళి, బాలేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బీ కొండపూర్ మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న 'సెహగల్ ఫౌండేషన్' బృందం

## అధునాతన పద్ధతులు పాటించాలి

చేగుంట, అక్టోబర్7: మహిళా రైతులు వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు పాటించి అధిక లాభాలు పొందాలని 'సెహగల్ ఫౌండేషన్' ఫీల్డ్ అసిస్టెంట్ శ్రావణ్‌కుమార్ సూచించారు. 'సెహగల్ ఫౌండేషన్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం చేగుంట మండల పరిధిలోని బి కొండపూర్ గ్రామంలో మహిళా రైతులకు చీడపీడల తెగులు నివారణ, పంటలకు కావాల్సిన సూక్ష్మపోషకాలు ఏవిధంగా ఎంత మోతాదులో వాడుకోవాలో పంటలకు మేలు కలిగించే పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో 'సెహగల్ ఫౌండేషన్' ప్రతినిధులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నర్సాపూర్, అక్టోబర్ 7: బీజేపీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని రావణ్‌గా చిత్రీకరించి మార్ఫింగ్ ఫొటోలు పెట్టడంతో నర్సాపూర్ పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు శనివారం ప్రధానమంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలోఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు చార్ల ఆంజనేయులు, నవీన్‌కుమార్, ప్రశాంత్, వినోద్‌నాయక్, నాయకులు శ్రీకాంత్, అర్జున్, ప్రసాద్, చింటు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న గురుకులం డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి

## సమాజం నుంచే సాహిత్యం పుట్టుకొచ్చింది

మెదక్ అర్బన్, అక్టోబర్7: సమాజం నుంచే సాహిత్యం పుట్టుకొస్తుందని, సామాజిక ప్రయోజనమే సాహిత్యం ప్రధాన లక్ష్యం కావాలని గిరిజన గురుకులం డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో 'తెలుగు సాహిత్యం, మహిళల ప్రస్థానం' అనే అంశంపై నిర్వహించిన 'నారీ చేతన' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఆర్సీవో సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ హిమబింధు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య

వెల్దుర్తి, అక్టోబర్7: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లిలో శనివారం జరిగింది. వెల్దుర్తి ఎస్సై మధుసూదన్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలగౌని శంకర్‌గౌడ్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు వినోద్(24) కొన్ని రోజులు పెట్రోల్ బంకు పని చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఈ నెల 5వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ శివారుతో పాటు పలు చోట్ల వెతుకుతుండగా వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ శివారు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పంచనామా నిర్వహించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్‌గౌడ్ వెల్లడించారు.



నూతన హెచ్‌ఎంను సన్మానిస్తున్న అక్కన్నపేట గ్రామ యువత

## యువత ఆదర్శంగా ఉండాలి

రామాయంపేట, అక్టోబర్ 7: యువత నాయకులు ఆదర్శంగా ఉండి పాఠశాలను సన్మార్గంలో నడపడమే కాకుండా సమస్యలపై స్పందిచాలని హెచ్‌ఎం.పద్మజ పేర్కొన్నారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నూతనంగా విధులు చేపట్టిన పద్మజను యువజన నాయకులు శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.